# మిసిమి

చింతనాత్మక సారస్వతం

2567వ బుద్ధ జయంతి



మాసపత్రిక, మే, 2023 ₹50/-

ISSN 2454-4329

# మిసిమి


మాసపత్రిక

సంపుటి 34 సంచిక 5

మే - 2023



సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం



KALA JYOTHI
— Since 1946 —

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 994 951 6567**
(10.00 am to 5.00 pm)

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
కార్యదర్శి : వి. ఆశారాణి
**040-27645536**

**Scan QR to Pay**
**Misimi Publication**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

UGC Care

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com**
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## మే నెల సూచికలు...


అనర్ఘరత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల్ రావు... 5
బుద్ధుడు చారిత్రక పురుషుడు : డా. దేవరాజు మహారాజు... 6
స్వామి వివేకానంద దృష్టిలో గౌతమ బుద్ధుడు : పురాణపండ రాఘవరావు... 9
మనమే బాధ్యులం : అశ్వినీ కుమార్... 10
మనోధర్మ సంగీతం : అమినేని సిద్ధయ్యనాయుడు... 16
జ్ఞానతంత్రులను మీటే ఆక్స్‌ఫర్డ్ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 19
గువ్వల చెన్నా! : కె. దినకర్... 25
రసాయన శాస్త్రవేత్త – కోలాచల సీతారామయ్య : డా. నాగసూరి వేణుగోపాల్... 31
శారదా శ్రీనివాసన్ తో మాటా–మంతీ : మిసిమి... 33
అందమా.. అందవా..? : ఎడిటర్స్ డైరీ... 42
కథాకథన చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి : భమిడిపాటి గౌరీశంకర్... 43
శృంగార నైషధంలో హంస : డా. టి.ఎన్. రసూల్... 45
వెలుదండవారి అక్షరమాల : డా. దత్తయ్య అట్టెం... 49
డాక్టర్ జివాగో నవలా నేపథ్యం : డా. వేలూరి కృష్ణమూర్తి... 52
తెలంగాణ: జానపద కళానిలయం : ధరంసోత్ సరిత... 55
ఇచ్ఛామతి తీరాన : డా. నల్లపనేని విజయలక్ష్మి... 57
జార్జియా ఓ కీఫ్ : టి.వి. ప్రసాద్... 61
తమిళ సాహిత్యసేవ: కె.ఏ. వెంకట రామయ్య : డా. పి.ఎస్. గోపాల కృష్ణ... 63
చిత్రగీతాలు జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 65
ఆత్మ సౌందర్య సాక్షాత్కారం : ఆచార్య వై. పార్థసారధి... 69
కొప్పర్తి కవితా శిల్పం : పోతుల శివాజీ... 73
వడ్డెర చండీదాస్ – హిమజ్వాల : వి. రాజారామ్మోహన్ రావు... 75
వేమన పద్యాల్లో 'అమ్మ..' 'అలీ..' : జె. మధుబాబు... 78
చదవండి... : మిసిమి... 80



బుద్ధ


ఆక్స్‌ఫర్డ్

### అట్టమీది బొమ్మలు


గౌతమ బుద్ధ


తండ్రి
ఖెమూర్ చిత్రకళ


తనయుడు
ఖెమూర్ చిత్రకళ


అవలోకితేశ్వరి



# శృంగార నైషధంలో హంస

- టి.ఎన్. రసూల్

ప్రసిద్ధి చెందిన మహాభారతంలో సరమ అనే పేరు గల కుక్క కథ ఆదిపర్వంలో ఉంది. పరీక్షిత్తుని కొడుకు జనమేజయుడు సత్రయాగం చేస్తుంటాడు. ఆ సమయంలో సరమ కొడుకు సారమేయుడు ఆ యజ్ఞం దగ్గరకు వచ్చి తిరుగాడుతుండగా జనమేజయుని తమ్ములు దాన్ని కొట్టి తరిమారు. ఆ కుక్కపిల్ల ఏడుస్తూ వచ్చి తల్లికి జరిగిన విషయాన్ని చెబుతుంది. అప్పుడు సరమ తన కొడుకును వెంటబెట్టుకుని జనమేజయుని యజ్ఞశాల వద్దకు వచ్చి ఇలా అంటుంది.

క. "క్షితినాథ! కడునకరుణా
నృతులై నీ తమ్ములతి వివేక విదూరుల్
మతిదలపక నా పుత్రుకు
నతి బాలకు ననపరాధనడిచిరి పెలుచున్".

(శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం 1వ ఆశ్వాసం-84)

ఓ రాజా! మిక్కిలి జ్ఞానహీనులై నీ తమ్ములు, దయలేనివారై చిన్నవాడని ఆలోచించకుండా ఏ తప్పు చేయని కుమారుణ్ణి కొట్టారు.

క. "తగునిది తగదని యెదలో
వగవకసాధులకుఁబేదవారలకెగ్గుల్
మొగిఁజేయు దుర్వినీతుల
కగునని మిత్తగామంబులయిన భయంబుల్".

(శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం 1వ ఆశ్వాసం-85)

ఈ పని యుక్తమైంది, యుక్తమైంది కాదు అని మనస్సులో ఆలోచించకుండా పేదవారికి, ఆశక్తులైనవారికి, మంచివారికి అపకారాలు కావాలని చేసే నీతిరహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తాయి.

ఈ విషయాన్ని గమనించిన మనకు కలిగే ఆశ్చర్యమేమంటే కుక్క పిల్ల ఏడుస్తూ వెళ్లి రాకుమారులు కొట్టిన విషయాన్ని తల్లికి చెప్పడం, తల్లి కుక్క యజ్ఞం జరిగే ప్రాంతానికి వచ్చి జనమేజయునితో మాట్లాడటం, అతనికి శాపాన్ని ఇవ్వడం. కుక్కకు మానవ లక్షణమైన మాటలను కవి ఇవ్వడం ఇక్కడ కన్పిస్తుంది. అందుకు కారణం దేవతా కుక్క అని చెప్పడం గమనించదగిన అంశం. కుక్కలు మాట్లాడలేవు. కుక్క పిల్ల మనిషిలాగా ఏడవనూ లేవు. మానవ లక్షణమైన మాట్లాడటాన్ని కేవలం సరమే కాదు మహాభారతంలో చాలాచోట్ల జంతువులను పాత్రలుగా చేసుకుని వాటికి మనుష్య సంభాషణలను కల్పించి కథను నడిపించడం గమనించవచ్చు. అయా జంతుపాత్రలు అచ్చం మనిషే అన్నట్లు మనకు కన్పిస్తాయి. ఇలా ఒక రచనలో జంతువులకు మానవ లక్షణాలను ఆరోపించడాన్ని "Anthropomorphism" అని అంటారు. తెలుగులో దీన్ని 'మానవ రూపం' అనవచ్చు.

ఈ Anthropomorphism అన్నమాట రెండు గ్రీకు పదాల నుండి వచ్చింది. Anthropos, morphe అనే రెండు పదాల కలయిక ఈ పదం ఏర్పడింది. Anthropos అంటే మానవులు, morphe అంటే రూపం. ఈ Anthropomorphism ను ఈ విధంగా నిర్వచించవచ్చు.

1. The Attribution of human characteristics or behavior to god, animal or object. (Oxford Dictionary)

2. The showing or treating of animals, gods, and objects as if they are human in appearance, character, or behavior (Cambridge Dictionary).

మానవ పాత్రలను, గుణాలను, జంతువులకుగాని, దేవుళ్ళకుగాని, వస్తువులకుగాని ఆపాదించడం Anthropomorphism.

మానవులు కాని వాటన్నిటికి, చివరకు దేవుళ్ళకు కూడా మానవరూపాన్ని, గుణాలను ఆపాదించి చాలా ప్రాచీన కాలం నుండి సాహిత్యాన్ని వెలువరిస్తూనే ఉన్నారు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలను గమనించిన మనకు ఈ విషయం తెలుస్తుంది.

గ్రీకు ప్రసిద్ధ ఇతిహాసాలైన ఇలియడ్, ఒడిస్సీ దగ్గర నుండి రామాయణ, మహాభారతాలు, పురాణాలు, కావ్యాలు మొదలగు వాటిలో ఈ రకమైన ఆపాదింపు కన్పిస్తుంది. మనుషులు కాని జంతువులు, వస్తువులు, దేవతలుగా భావింపబడేవారు అచ్చం మానవుడిలా వ్యవహరించడం ఒక సాహిత్య విధానంగా భావించవచ్చు.

కవులు, రచయితలు ఈ Anthropomorphismను కథను నడపడానికి ప్రముఖమైన దానిగా భావించి ఉపయోగించడం ప్రపంచంలోని అన్ని సాహిత్య రచనల్లో చూడొచ్చు. పైన ఉదాహరించిన సరమ పాత్రను కూడా ఈ మానవరూపం అనే దాంట్లో నుండే చూడొచ్చు. జనమేజయునికి శాపం ఇవ్వడానికి కవి ఋషి పాత్రను అక్కడ ఉంచవచ్చు కాని కుక్కను ఆ స్థానంలో ఉంచి పాఠకుడికి కథ పట్ల ఆసక్తిని, ఆనందాన్ని కలిగించడం చేశాడు. ప్రాచీన సాహిత్య రచనల్లో ఇలాంటి విధానం ఎక్కువగా కానవస్తుంది. మన ప్రాచీన సాహిత్యంలో ముఖ్యంగా జానపద, కథాసాహిత్యాలలో ఈ రకమైన విధానం చాలా అంటే చాలా ఎక్కువ. పంచతంత్ర కథలు, జాతక కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు ఇంకా అనేక జానపద, పౌరాణిక కథల్లో ఈ మానవరూపం ఒక కథాకథనంగా ప్రధానపాత్ర పోషించిన విధానం, పాఠకులను విపరీతంగా ఆకర్షించిన తీరు మనం గమనించవచ్చు.

ఆంగ్ల సాహిత్యంలో కూడా ఈ Anthropomorphism ఎక్కువగా కన్పిస్తుంది. ఆంగ్లంలో నవలల్లో ఈ రకమైన సాహిత్య అనుభూతిని పాఠకుడికి కల్పించడం కన్పిస్తుంది. మనిషి పాత్ర లేకుండా అన్ని జంతువుల పాత్రలతో రాసిన రచనలు కొన్నైతే, మనుషులతో పాటు జంతువులను పాత్రలుగా ఉపయోగించి వాటికి మాటలను ఆపాదించి రచనలు చేసినవి మరికొన్ని మనకు కన్పిస్తాయి. అలాంటి రచనలన్నీ ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. అలాంటి వాటిలో Alices Adventure in Wonderland, Jungle Book, Animal Form, Call of Wild, The Hobbit, The Lord of Ring మొదలైనవి ఉన్నాయి. ఆంగ్ల రచనల్లో ఎక్కువగా చిన్న పిల్లలకు చెందిన రచనల్లో ఈ మానవరూపం కన్పిస్తున్నా, వ్యంగ్యరచనల్లోనూ, సాహస కథలలోనూ కూడా కన్పిస్తుంది. ఇలా కాకుండా మనిషి ఇతర జంతువుగా మారినా మానవ రూపాన్ని అంటిపెట్టుకుని ఉండే రచనలు ఉన్నాయి. అలాంటి వాటిలో Franz Kafka రాసిన Metamorphosis, Neil Gaiman రాసిన Sandmanలను పేర్కొనవచ్చు.

ఆధునిక యుగంలో ఈ Anthropomorphismను విరివిగా ఉపయోగించుకుని అనేక సినిమాలను నిర్మించడం జరుగుతున్నది. Kung pand, Lion King, Cars the Brave, Little Toaster, Beauty of the Beast, The Wizard of Oz మొదలైన సినిమాలు యానిమేషన్ ఆధారంగా రూపొంది చిన్నపిల్లలను, పెద్దలను ఆకర్షించడం అందరికీ తెలిసిందే. బాలలకు చెందిన సాహిత్యంలో ఈ మానవరూపంను ఎక్కువగా ఉపయోగించినా, అనేక ప్రముఖ రచనల్లో కూడా ఇది ప్రముఖం గానే ఉంది. చదివే వారి ఉత్సుకతను మరింత పెంపొందించ డానికి ఈ మానవరూపం బాగా ఉపయోగపడుతుంది.

**మత గ్రంథాల్లో మానవరూపం:** కేవలం సాహిత్య గ్రంథాల్లోన్నే కాకుండా మత సంబంధమైన గ్రంథాల్లోనూ, కథల్లోనూ ఈ Anthropomorphism కన్పిస్తుంది. భగవద్గీత, బైబిల్, ఖురాన్, తోరా, జెందా అవెస్థ లాంటి గ్రంథాల్లో అద్భుత రసావిష్కరణ కోసం ఈ విధానాన్ని ఉపయోగించిన సందర్భాలున్నాయి. మత సంబంధమైన రచనల్లో దైవత్వానికి గొప్పతనాన్ని ఆపాదించ డానికి మహిమలను, అద్భుతాలను ఎక్కువగా చెప్పేటప్పుడు దేవునికి మనిషి మాటలను అందించడం గమనించవచ్చు. దేవుళ్ళకు కోపం రావడం, మానవుడిలా ఆలోచించడం, పక్షపాత ధోరణి మొదలైనవి దేవుళ్ళకు ఆపాదించిన సంఘటనలు మత గ్రంథాల్లో చూడొచ్చు.

**Anthropomorphism కు Personification కు తేడా :** Anthropomorphismకు Personificationకు చిన్నపాటి తేడా ఉంది. మానవరూపం జంతువులను, వస్తువులను, దేవతలను అచ్చం మానవుడిలా ఉండేటట్లు చేస్తే, Personification మూర్తిమత్వ లక్షణాలను ఆపాదించి మానవీకరణ చేస్తుంది. Anthropomorphism లిటరల్ అర్థాన్నిస్తే, Personification అలంకారిక భాషగా ఉపయోగపడుతుంది. “మేఘం కునుకు తీస్తోంది” అన్నప్పుడు మేఘానికి మానవుడి లక్షణం కునుకును ఆపాదించడం మానవీకరణ. ప్రారంభంలో పేర్కొన్న సరమ మాట్లాడటం మానవరూపం. మానవీకరణలో మాట్లాడటం తప్పమిగిలిన అన్ని లక్షణాలను అలంకారికంగా చెప్పవచ్చు.

**శృంగార నైషధంలో Anthropomorphism :**

సంస్కృతంలో శ్రీహర్షుడు రాసిన నైషధీయమ్‌ను శ్రీనాథ మహాకవి శృంగార నైషధం పేరుతో తెలుగు చేశాడు. నలదమయంతుల కథను చెప్పే ఈ కావ్యం ఎనిమిది ఆశ్వాసాలు. ఈ కావ్యంలో ఉన్న పాత్రల్లో ఒకానొక ముఖ్యపాత్ర హంస.

సుమారు వంద పద్యాల్లో ఈ హంస పాత్ర మనకు కన్పిస్తుంది. ఈ హంస పాత్రను తీర్చిదిద్దడంలో కవి చూపించిన నేర్పు మానవరూపంగా ఎలా పరిణమించినదో పరిశీలిద్దాం.

దమయంతి పట్ల అనురక్తుడై ఉన్న నలుడు ఒక రోజు వన విహారానికి వెళ్ళి, అక్కడి సరోవరంలో ఉన్న బంగారు రంగులో మెరిసిపోతున్న ఒక హంసను పట్టుకుంటాడు. ఆ హంస తప్పించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేసి, విఫలమై మానవ భాషలో నలునితో మాట్లాడుతుంది. హంస పక్షి జాతికి చెందినది. మాటలు రానిది. మానవ ఆలోచనలు, ప్రవర్తనలు, లక్షణాలు ఏవీ కలిగి ఉండనిది అయిన హంస నలునితో మాటలు కలిపింది. "రెక్కలఁకొనలం గలిగిన యిక్కాంచన మాసపడియదే నృప"? (శు.నై 1-105) అని ప్రశ్నిస్తుంది. మానవ సంబంధమైన నీతి విషయాలను చెప్పి తనను విడిచి పెట్టమని అడుగుతుంది. తన ప్రయత్నాలన్నీ విఫలమవ్వగా నలునికి జాలి కలిగేలా తన కుటుంబ దీనస్థితిని ఈ విధంగా చెబుతుంది.

సీ. తల్లిమదేక పుత్రక, పెద్దకన్నులు గానవిప్పుడు,
మూడుకాళ్ళ ముసలి
ఇల్లాలు గడు సాధ్వి ఏమియు
నెఁఱుగదు పరమపాతివ్రత్య భవ్యచరిత
వెనుక ముందర లేరునెనరైన చుట్టాలు
లేవడి యెంతేని జీవనంబు
కానక కన్న సంతానంబు శిశువులు
జీవనస్థితికే నతావలంబు
తే. కృపఁదలంపఁగదయ్యా యో నృప వరేణ్య !
యభయ మీవయ్య యోతుహినాంశు వంశ !
కావఁగదవయ్య యర్థార్థి కల్పశాఖి,
నిగ్రహింపకుమయ్య యో నిషధ రాజ. (శు.నై 1-109).

ఈ పద్యంలో హంస తన తల్లిని గురించి చెబుతున్నది. హంస తల్లి పడుతున్న కష్టాలన్నీ మానవులకు చెందినవే. మానవులు తప్ప వేరే వారు వాటిని గురించి చెప్పలేరు. హంస ప్రస్తావించిన పెద్దకన్నులు కానదు, మూడుకాళ్ళ ముసలి, ఇల్లాలు, కడుసాధ్వి, పాతివ్రత్య భవ్య చరిత, చుట్టాలు లేకపోవడం, మొదలైన విషయాలు మానవులకు చెందినవి. అవి హంసకు తెలియదు. ఇక్కడ హంస చేత కవి మాట్లాడించడం మనం గమనిచాల్సిన విషయం. చివరకు నలుడు హంసను విడిచిపెడతాడు. తనను విడిచినందుకు హంస నీకు నొక్క ప్రియంబు చేసెద (2-8) అనిపల్కుతుంది. దమయంతి సౌందర్య వర్ణన చేసి నలునికి ఆమె పై మోహాన్ని కలిగేటట్లు చేయడం కథాపరంగా అతి ముఖ్యమైన సందర్భం. అందుకు కవి హంస చేత దమయంతి కథను చెప్పి ఆమె అంగాంగ వర్ణన చేసి కవిలా తోస్తుంది. హంస ద్వారా దమయంతి వర్ణన చేయటం, హంసకు మానవ భావనలను ఉండేటట్లు కల్పించడం ఇక్కడ మనం గమనించవచ్చు. కేవలం మామూలు మాటలనేకాదు కవిత్వ నైపుణ్యాన్ని, వర్ణనా వైదుష్యాన్ని, ఆలంకారిక సామర్థ్యాన్ని కలిగిన పాత్రగా హంస కన్పిస్తుంది. హంస ఇక్కడ తెలుగు, సంస్కృత భాషలలో పాండిత్యాన్ని, వ్యాకరణజ్ఞానాన్ని కలిగిన వ్యక్తిగా, ఆ పాండిత్య, కవితా నైపుణ్యంతో దమయంతిని వర్ణించడం గమనిస్తే అది హంస కాదు మనిషే అన్న అభిప్రాయం కలుగుతుంది. కొన్ని ఉదాహరణలను పరిశీలిస్తే గాని ఆ హంస ఎంతటి కావ్య నిపుణత్వం కలిగిందో అవగతం కాదు.

తే. రాజబింబంబు నందు సారము హరించి
చేయఁబోలు విధాత యా చెలువ మోము
నడిమి రంధ్రంబు నందుఁగానవచ్చు
ఖనిజ నీలిమ యది నిదర్శనము గాదె. (2-13)

దమయంతి మోమును తయారు చేయడానికి బ్రహ్మ చంద్రుని నుండి సారాన్నంతటిని తీశాడు. అంచేత చంద్రుని మధ్యలో ఒక రంధ్రం పడి నల్లగా కన్పిస్తున్నది. ఒక హంస ఇల్లాంటి ఊహ చేయడం జరగదు. అది మనుష్య భాష తెలిసింది కావడం వల్ల ఈ విధమైన ఊహ చేయడం సాధ్యమైంది. సంస్కృత పద భూయిష్టమైన వాక్యనిర్మాణంతో దమయంతిని ఇలా వర్ణించింది -

మ.వనజాతేక్షణ యూరు యుగ్మమున లావణ్యంబునం గెలికా
నన సంక్రందన పట్టణ ప్రకట జన్మ స్థానలన్ రంభలన్
ధనదా పత్య తపః ఫల స్తనుల నత్యంతాభిరామాంగులన్
మనుజాధీశయధఃకరించు; బోగడన్ మా బోంట్లకున్ శక్యమే? (2-19)

ఈ పద్యంలో దమయంతి ఊరువులను వర్ణిస్తున్నది హంస. శృంగార వర్ణనలు చేయటంలో కూడా హంస నేర్పరిలా కనిపిస్తూనే, మాలాంటి వారికి ఆ వర్ణన సాధ్యమా! అని గడుసు దనంతో మాట్లాడుతుంది. కథాపరంగా నలునికి దమయంతి పై ప్రేమ కలిగే చేయడానికి కవి హంసపాత్రకు మాటలను, కవిత్వాన్ని, చాతుర్యాన్ని ఇచ్చి పాఠకులకు కథపై ఆసక్తి కలిగేలా చెయ్యడం కవి ఉద్దేశంగా కన్పిస్తున్నది.

కేవలం దమయంతిని వర్ణించడమే కాదు నలుని తరుపున దమయంతి వద్దకు దూతగా వెళ్ళడానికి సిద్ధ పడుతుంది. దూతగా వెళ్ళి నలునిపై మోహంగా ఉన్న దమయంతి వద్ద నలుని వర్ణించి దమయంతిని మరింత మోహానికి గురిచేస్తుంది. కవి ఇక్కడ హంసను దూతగా ఉపయోగించుకున్నాడు. సాధారణంగా దూతతనానికి తెలివి గలవాళ్ళు, వాక్చాతుర్యం ఉన్నవారు, సంయమనం కోల్పో కుండా కార్యాన్ని చక్కబెట్టే సమర్థులుగానూ ఉండేవాళ్ళను ఎంపిక చేసుకుంటారు. ఇక్కడ హంసను ఎంపిక చేసుకోవడం వల్ల అవన్నీ హంసకు ఉన్నట్లు భావించాలి. కవి ఇక్కడ హంసకు మానవరూపాన్ని ఆరోపించడం చూడవచ్చు. హంస దమయంతి వద్దకు వెళ్ళి తాను ఎంత గొప్పదాన్నో ఇలా తెలియజేస్తుంది.

సీ.నలిన సంభవు సాహినము వారువంబులు కులము
సాములు మాకుఁగువలయాక్షి,
చదలేటి బంగారు జల రుహంబుల తూండ్లు
భోజనంబులు మాకుఁబువ్వుబోణి,
సత్యలోకము దాఁక సకలలోకంబులు నాటపట్టులు
మాకు అబ్జవదన,
మధురాక్షరములైన మా మాటలు వినంగ
నమఁతాంధసులె యోగ్యులనుపమాంగి,
తే.భారతీ దేవి ముంజేతి పలుకుఁజిలుక సమద
గజయాన సబ్రహ్మ చారి మాకు,
వేదశాస్త్ర పురాణాది విద్యలెల్లఁ దరుణి నీయాన ఘంటా
పథంబు మాకు. (2-49)

ఈ పద్యంలో తాను దేవతా పక్షినని మనుష్య భాషతో చెబుతుంది. ఈ పద్యంలో ఒకపక్క దేవతా పక్షినని చెబుతూనే మరొకపక్క మనుష్యులు నేర్చే విద్యలను నేర్చానని చెప్పుకుంటుంది. ఎదుటివారిని ఆకర్షించే మాటల నైపుణ్యం హంసకు ఉంది. ఇలా స్వోత్కర్ష మనుషులు తప్ప హంసలు చేసుకోవు. కాబట్టి ఇక్కడ హంసకు మానవరూపంను కవి ఆపాదించాడన్న మాట. ఇవన్నీ దమయంతని ఆకట్టుకోవడానికి హంస తన గొప్పతనాన్ని, దైవత్వాన్ని దమయంతి తెలిపి దమయంతి తన మాటలు వినేట్లు చేసుకున్నది. నలుని పరాక్రమాన్ని చెబుతూనే సందర్భం చూసుకొని తన గొప్పతనాన్ని దమయంతికి చెప్పి తన మాటమీద గురి కుదిరేలా చేసుకుని నలునిపై దమయంతికి అనురక్తి కలిగేలా చేయడానికి హంస ప్రయత్నిస్తుంది. నిషధ రాజు తప్ప వేరొకరు నిన్ను పెళ్ళాడటానికి తగినవారు కాదని,ఆవిషయాన్ని బ్రహ్మే స్వయంగా తనతోటి చెప్పాడని చెబుతుంది.

ఉ.
అడిగితినొక్కనాడు కమలాసను తేరికి వారువంబునై
నడుచుచు నుర్విలో నిషధ నాధునికెవ్వతె యొక్కొ భార్య య
య్యెడు?నని చక్ర ఘోషమున నించుక యించుక గాని యంత యే
ర్పడ వినఁగాని నీ వనుచు, బల్కిన చందము దోఁచె మానినీ!
(2-58)

హంస ఈ విధంగా దమయంతికి భర్త అయ్యేది నలుడేనని రూఢీ పరిచేటట్లు తన వాక్చాతుర్యంతో చెబుతుంది. మరొక పక్క దమయంతి అందచందాలను పొగుడుతుంది. నీకు తగినజోడి నలుడే, అతణ్ణి వివాహం చేసుకోవడానికి నేను సహాయం చేస్తానని చెబుతుంది. ఎంతసేపైనా దమయంతి నిర్ణయం తీసుకోలేనిదని గ్రహించి "బాలికల చిత్తములంబు తరంగ లోలముల్" (2-67) అనిదెప్పుతుంది. తన మాటల గారడీతో దమయంతి నలుణ్ణి పెళ్ళాడేటట్లు ఒప్పిస్తుంది.

దమయంతిని పెళ్ళికి ఒప్పించడమే కాదు, పెళ్ళి జరిగాక జరిగే మన్మధ విషయాలను దమయంతికి తెలియపరుస్తుంది. ఈ హంస కామశాస్త్రమందు కూడా నిపుణురాలు. దూతగా వచ్చి కార్యం సాధించి తిరిగి నలుని వద్దకు వెళ్ళి దమయంతి పై అనురాగాన్ని పెంచుకున్న నలునికి కార్యం నెరవేరిందని చెబుతుంది. ఒక హంస పాత్రకు ఇంత ప్రాధాన్యత ఇచ్చి కవి కథను నడిపించడంలో ఉన్న ముఖ్యమైన అంశం హంసకు మానవ రూపాన్ని ఇవ్వడం.

కేవలం హంసే కాకుండా దేవతాలకు కూడా మానవ రూపాన్ని ఇవ్వడం శృంగార నైషధంలో చూడొచ్చు. ఇంద్రాది దేవతలు దమయంతి స్వయంవరంకు వచ్చి నలుణ్ణి తమ దూతగా దమయంతి వద్దకు పంపుతారు. ఇక్కడ దేవతలైన ఇంద్రాది దేవతలు మనుష్య భాషను ఉపయోగించడం, మానవ సంబంధమైన ఆలోచనలతో దమయంతిని పెళ్ళి చేసుకో వాలనుకోవడం మానవరూపంలో భాగమే.

డా. టి. ఎన్. రసూల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడెరు,
సెల్ నెం : 9490170661